www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి | భద్రాద్రి

ఆదివారం | 19 | జూలై | 2026 | పేజీలు : 8

## బంగారం కోసం వృద్ధురాలి దారుణ హత్య



- మండలంలో వరుస దొంగతనాలు
-భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

సెంటర్ స్ప్రెడ్

# గిరిజన హక్కుల రక్షణకు పోరాటం








- పోడుభూములపై నిర్బంధాలు ఎందుకు..?
వివిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలి
సిపిఐ జాతీయ కార్యదర్శి అనీరాజా, కూనంనేని
- ఘనంగా ప్రారంభమైన గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు
- కదం తొక్కిన గిరిజనం, భారీ ప్రదర్శన, హోరెత్తిన నినాదాలు

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం/పాల్వంచ : గిరిజనుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైన ఉందని అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇంచార్జ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి అనీ రాజా పిలుపునిచ్చారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య(టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలు ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ నుండి దమ్మపేట, అంబేద్కర్ సెంటర్ల మీదుగా

మిగతా 2లో..

## వాతావరణానికి అనుగుణంగా సాగు

-రూ 4.61కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



ప్రజాపక్షం/కూసుమంచి : ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి పంటలకు బదులుగా మెట్ట పంటలు సాగు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించిన మంత్రి, రూ 4.61కోట్లతో బీటీ రోడ్లు, గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 66 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి,

మిగతా 2లో..

## గిరిజన మహిళలపై అటవీ అధికారుల దాష్టీకం

-సర్వత్రా నిరసన
-ఒప్పందం ఉల్లంఘించారంటున్న అధికారులు







ప్రజాపక్షం/ఖమ్మం/అశ్వాపురం : పోడు సమస్య రగులుతూనే ఉంది. ప్రభుత్వాలు మారిన పోడు రైతుల పట్ల అటవీశాఖాధికారుల తీరు మాత్రం మారడం లేదు. ముఖ్యంగా ఆదివాసీ మహిళల పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తుంది. అశ్వాపురం మండలం మనుబోతుల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వేములూరుకు సమీపంలో ఆదివాసీ గిరిజనులు పోడు నరికి సాగు చేసుకుంటున్నారు. ఆదివాసీలు నివసించే ప్రాంతాన్ని నాగేశ్వరరావు గుంపు పేరుతో పిలుస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడి గిరిజనులు పోడు నరుకుతుండగా సాగు చేయడానికి వీలు లేదంటూ అటవీ శాఖాధికారులు శుక్రవారం సాయంత్రం పోడు రైతులను అడ్డుకున్నారు. యంత్రాలతో భూమిలో అటవీ అధికారులు పనిచేయిస్తుండగా గిరిజన మహిళలను అడ్డుకున్నారు. వారి పట్ల అటవీ అధికారులు అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా వారిపై చేయి

మిగతా 2లో..

# గిరిజన హక్కుల రక్షణకు పోరాటం

(మొదటిపేజీ తరువాయి)
భారీ ప్రదర్శన పాత ఆర్డిఓ కార్యాలయం వద్ద గల అమరజీవి సిద్ధి వెంకటేశ్వర్లు స్మారక స్థూపం వరకు సాగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి ఆమె సిద్ధ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. పట్టణ ప్రధాన రహదారిపై సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. అడుగడుగునా చేసిన నినాదాలతో పాల్వంచ మార్మోగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో అనీరాజా మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. పోడు సాగుదారులపై జరుగుతున్న నిర్బంధాలను అణిచివేతలను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. అడవులను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. సహజ వనరులపై ఆదివాసీలకు ఉన్న సాంప్రదాయ హక్కులను కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ పేరుతో ఆదివాసీలను వారి పురిటిగడ్డ నుండి దూరంచేసే ఏ ఒక్క చర్యను కూడా సహించేది లేదని హెచ్చరించారు. తరతరాలుగా వస్తున్న సంసృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే హక్కుల సాధన కోసం యువత పెద్ద ఎత్తున కదలాలన్నారు. భవిష్యత్‌లో గిరిజన ఐఖ్యతను చాటే విధంగా మరిన్ని ఉమ్మడి ఉధ్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**అణిచివేతలపై ఉధ్యమించక తప్పదు - కూనంనేని**

అడవిపై ఆధారపడి బ్రతుకుతున్న గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని, ఇలాంటి అణిచివేతలపై ఉధ్యమించక తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. తరాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. పాలకుల అణిచవైత వైఖరిపై ఐఖ్య ఉధ్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ మహాసభల ద్వారా గిరిజన సమస్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించి రాబోయే రోజుల్లో బలమైన పోరాటాలు నిర్మిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పన పూర్తిగా కుంటుపడిందని, విద్యా వైద్య రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆయన ఆవేదనవ్యక్తం చేశారు. ఏజెన్సీ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల పేద గిరిజన విద్యార్థుల భవిష్యత్ అంధకారం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా గిరిజన బ్రతుకుల్లో మార్పులు రావడం లేదని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ పాలకులు వారిని వాడుకుంటున్నారని విమర్శించారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులను ఇతర రంగాలకు మళ్లించడాన్ని తక్షణమే ఆపాలని, జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసారు. అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తాము ఎల్లవేళలా ముందుంటామని శాసన సభ లోపల వెలుపల వారి గొంతుకగా నిలబడతానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కొండంత అండగా ఉన్న ఉపాధి హామీ పథకం పేరు మార్చి దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికల్పనను దెబ్బతీసే ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలునిచ్చారు. ఉపాధిహామీ నిధులను తగ్గించడం వల్ల వలసలు పెరిగిపోయే ప్రమాదం ఉందని, స్థానికంగానే పనిదినాలను 200 రోజులకు పెంచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఐటిడిఏల పనితీరును మెరుగు పరచాలని స్థానిక సంస్థలకు నిధులు విధులను బదిలీ చేయాలని కోరారు. అటవీహక్కుల చట్టం2006ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పోడుభూముల సమస్యను శాశ్వత పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలందరినీ ఏకం చేసి హక్కుల సాధన కోసం అతిపెద్ద జాతీయ ఉధ్యమాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం అనీరాజా, కూనంనేని బంజార సంప్రదాయ బిందెలను నెత్తిన ఎత్తుకున్నారు. ఇందులో భాగంగా అనీరాజా బంజారా మహిళా వస్త్రధారణకు చెందిన చెంగును నెత్తిన వేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రమావత్ అంజయ్య నాయ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మునిస్పల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వరు నరాటి ప్రసాద్ సరెడ్డి పుల్లారెడ్డి ఎస్‌డి సలీం సలిగంటి శ్రీనివాస్ మున్నా లక్ష్మీ కుమారి జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు వాసిరెడ్డి మురళీ ఉప్పుశెట్టి రాహూల్ మువ్వా వెంకటేశ్వర్లు రేసు ఎల్లయ్య గిరిజన సమాఖ్య నాయకులు జువారి రమేష్ నాయక్ స్వరూప సొందు కుటుంబ రావు భూక్య శ్రీనివాస్ బి వెంకట్ బానోత్ రాంబాబు గణేష్ వివిధ జిల్లాల ప్రతినిధులు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సందిగ్ధంలో మిర్చి సాగు రైతులు..!



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో మిర్చి సాగు రైతులు వర్షాభావ పరిస్థితుల వలన సందిగ్ధం లో ఉన్నారు. మండల పరిధిలోని దారుక బంజరు, చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, తెలగవరం, మర్లపాడు,వెన్నవల్లి, చెన్నూరు, లక్ష్మీపురం, బత్తులపల్లి, పేరువంచ తదితర గ్రామాలలో మిర్చి సాగుకు దుక్కులు దున్ని చేలు సిద్ధం చేసుకొని ఉన్నారు .ఈ ఈ సమయంలో సుమారు 500 ఎకరాలు పైగా 300 మంది రైతులు మండలంలో సాగుకు సిద్ధమై ఉండగా ఈ సమయంలో ఎల్ నిన్ నో ప్రభావంతో వర్షాలు గత 18 రోజులుగా కురవనందున మిర్చి సాగు రైతులు సందిగ్ధంలో అయోమయంలో ఉన్నారు. ఈ పరిస్థితులలో ఆగస్టు 5వ తేదీ నుండి మిరప నారు కూడా సిద్ధం చేసుకుని ఉంటున్నారు. అక్టోబర్ నెల నుంచి డిసెంబర్ వరకు ఈ మిర్చి పంటను కొనసాగిస్తారు. ఈ సమయంలో ఒక్కో ఎకరాకు 15000 రూపాయలతో ఎకరాకు మిరపనారు ఖర్చు, మొదటి నుంచి పంట చేతికి వచ్చేవరకు ఎకరాకు రెండు లక్షల పెట్టుబడి ప్రణాళికలతో సిద్ధం చేసుకొని ఉన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో నర్సరీలు కూడా ఇప్పటికే ఒక 15 రోజుల నుంచి సిద్ధం చేసుకుని ఉన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు సబ్సిడీలతో వారికి వారితో సమీక్షలు చేసుకొని ఉన్నారు. అయితే ఈ సీజన్ కు మిర్చి పంట సాగుకు అయోమయం సందిగ్ధంలో ఉన్నారు. దీనివలన రైతుల్లో ఈ సంవత్సరం పంట దిగుబడి తక్కువతో పాటు సాగు కూడా కష్టమే అని రైతుల్లో చర్చలు కొనసాగుతున్నవి. ఈ సంవత్సరం మిర్చి సాగు ప్రశ్నార్ధకంగా మారింది. వాతావరణంలో అనుకూలంగా వర్షాలు ఉంటే మిర్చి పంట సాగు చేయవచ్చని లేనిచో ప్రశ్నార్ధకం అనుమానస్పదంగా మిర్చి పంట ఉంటుందని రైతుల్లో చర్చలు కొనసాగుతున్నవి .ఈ సంవత్సరం మిర్చి పంటకు ఈ సీజన్ కలిసివచ్చేనా ? అంటూ ఒకరు ఒకరు చర్చలు కొనసాగిస్తున్నారు.

## డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సమితి సభ్యుడిగా తడికమళ్ల యోబు




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన సమితి గిరి ప్రసాద్ భవన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన డీహెచ్‌పీఎస్ తెలంగాణ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల అనంతరం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన కామ్రేడ్ తడికమళ్ల యోబును రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యోబు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా దళితులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికకు సహకరించిన సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు

## అమ్మపాలెంలో ‘సర్’ను పరిశీలించిన చంద్రావతి




**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని (ఎస్ఆర్) సర్ కార్యక్రమాన్ని వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి శనివారం పరిశీలించారు. గ్రామంలో సర్ ప్రక్రియ ఎలా సాగుతోంది, సంబధిత అధికారులను, బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మొత్తం ఓటర్ల సంఖ్య, అందరికి ధరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారా? దరఖాస్తు ఫారాలు నింపడంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి, ఆన్‌లైన్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందనే అంశాలపై వివరాలు సేకరించారు. ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుకూరు నాగేంద్రమ్మ, బిఎల్‌ఏ కమసాని నాగేశ్వరరావు, జడ రాజ్‌కుమార్, తేజావత్ రామ్మూర్తి, తేజావత్ రామ, షేక్ ఖాదర్‌బాబు, రావెళ్ల శ్రీను, పుప్పాల రామలింగం, దారాగాని వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఇబ్రహీం, ఎస్‌కె చాంద్‌మియా,చవగాని సైదులు,చవగాని వెంకటపిచ్చయ్య, పసుపులేటి కృష్ణయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** హైదరాబాద్‌లోని అమరజ్యోతి ప్రాంగణంలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు పాల్గొని ఉద్యమకారుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా అర్హులైన ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ పథకాలు, గౌరవం కల్పించాలని జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు, కార్యదర్శి అనంతారపు వెంకటాచారి కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి పోలు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలపై అటవీ అధికారుల దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)
చేసుకుని కిందపడేశారు. అటవీ శాఖాధికారుల తీరుతో గిరిజనులు బెంబేలెత్తారు. పోడు సాగు రైతులపై అధికారులు దౌర్జన్యం చేయడాన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

**హద్దు దాటారు : అటవీ అధికారి బాబు**

మనుబోతులగూడెం గ్రామ పంచాయతీ నాగేశ్వరరావు గుంపు వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి అటవీశాఖాధికారి బి. బాబు మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి 10 మంది గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన సంబంధిత అధికారిపై విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు. అడవుల సంరక్షణకు ప్రజల సహకారం ముఖ్యమని ఆయన అన్నారు. గిరిజనులు గతంలో ఉన్న పోడు కాకుండా హద్దులు దాటారని శాంతియుతంగా మాట్లాడుకునే సమయంలో గిరిజనులు దాడి చేశారని ఆయన తెలిపారు.

## వాతావరణానికి అనుగుణంగా సాగు

(మొదటిపేజీ తరువాయి)
షాదీముబారక్ చెక్కులు, 111 మందికి రూ 35.16లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్‌ఎఫ్)చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరు వెంకటరెడ్డి, సీడీసీ ఛైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కొండ కృష్ణవేణి, మేడిపల్లి విజయ, తదితరులు పాల్గొన్నారు.

## 108 జిల్లా నూతన ఈఎంఈగా ఆలేటి ప్రణయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ఖమ్మం జిల్లా 108 సేవలకు నూతన జిల్లా అధికారి (ఈఎంఈ)గా ఆలేటి ప్రణయ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో 108లో జిల్లా అధికారి (ఈఎంఈ)గా సేవలందించిన అవులూరి దుర్గాప్రసాద్ వనపర్తి జిల్లాకు బదిలీ కావడంతో సత్తుపల్లి 108 ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బందితో పాటు 1962 పశుసంచార వాహన సిబ్బంది, 102 అమ్మఒడి వాహన సిబ్బంది, ఉచిత ఎఫ్‌హెచ్‌ఎస్ (ఫ్రీ హియర్స్ సర్వీస్) మార్చురీ వాహన సిబ్బంది పాల్గొని దుర్గాప్రసాద్‌కు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మూడు జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, ఖమ్మం జిల్లా 102 అమ్మఒడి అధికారి షేక్ ఇమామ్ పాషా, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల 108 అధికారులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో దుర్గాప్రసాద్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన నాయకత్వంలో 108 అత్యవసర సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందాయని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు తుమ్మా జగదీష్, గొల్లమందల కృష్ణ, ఎర్నం అప్పారావు, కొండ్రు రవి, చాట్ల శ్రీను, ఎంకి శ్రీను, భాస్కర్, పైలెట్లు సయ్యద్ ఖాద్రి, సీతారాంబాబు, శ్రావణ్, రవి, ఉప్పలయ్య, వంశీకృష్ణ, వీరబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.

# అర్హుల పేర్లు ఓటరు జాబితాలో ఉండాలి



**-పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఏలు కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని టూటౌన్ ప్రాంతంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిఎల్‌ఏలతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వారి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ గడువు పొడిగించిన నేపథ్యంలో ప్రతి కార్యకర్త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రతి ఓటును కాపాడటం బిఆర్ఎస్ కార్యకర్తల బాధ్యత అన్నారు. బిఎల్‌ఓలతో కలిసి బిఎల్‌ఏలు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ అర్హుల ఓటు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దరఖాస్తుల పరిశీలన, అవసరమైన పత్రాలు సమర్పణ, అభ్యంతరాల పరిష్కారం వంటి అంశాలపై కార్యకర్తలకు సమగ్రంగా అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు అందించారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడు సముచిత స్థానం , గుర్తింపు లభిస్తాయన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదును కూడా చురుగ్గా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, శీలంశెట్టి వీరభద్రం, బత్తుల మురళీ, తాజుద్దీన్, టూటౌన్ పరిధిలోని డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశానికి ముందు 53వ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

# గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని అంజనాపురంలో వద్ద నిర్మించిన గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డితో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని ప్రతి ఏర్పాటును ముందస్తుగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సభాప్రాంగణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని వీఐపిలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, మీడియా ప్రతినిధులు, ప్రజలకోసం ప్రత్యేకంగా కూర్చునే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ శాఖకు సూచించారు. రహదారుల మరమ్మత్తులు, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పూర్తి చేయాలని అన్నారు. ట్రాఫిక్ కు అంతరాయంలేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధంచేసి ప్రజలకు ముందస్తుగా సమాచారం అందజేయాలని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ నిరంతరాయంగా విద్యుత్‌సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం పామాయిల్ సాగు అభివృద్ధికి ప్రోత్సాహకరంగానిలుస్తుందని తెలిపారు. రైతులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని స్పష్టం చేశారు. అందుకు తగిన విధంగా రైతుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతిశాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గోద్రెజ్‌సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట రూ.3.14కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**- ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన**



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం, గ్రామాలకు నాణ్యమైన రహదారులు అందించడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరో ముందడుగు పడింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం నియోజకవర్గంలోని దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించి రూ.3.14కోట్ల వ్యయంతో చేపట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పర్యటన దమ్మపేట మండలం నాచారం గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవంతో ప్రారంభమైంది. అనంతరం వడ్లగూడెం, మారప్పగూడెం, నారవారిగూడెం కాలనీ, అల్లిగూడెం గ్రామాల్లో నూతంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రజలకు అంకితం చేశారు. ఈ రహదారులు గ్రామాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడమే కాకుండా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగిస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తదనంతరం అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇకోపార్క్ పనులను ఎంపి, ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పార్క్ పూర్తయితే అశ్వారావుపేట పట్టణానికి ప్రత్యేక ఆర్షణగా మారడంతో పాటు పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఉట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం గ్రామాల్లో సిసి రోడ్లను ప్రారంభించి గ్రామస్థులతో మాట్లాడారు. స్థానిక అవసరాలను తెలుసుకుని మరిన్ని అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు చేశారు. భోజన విరామం అనంతరం జెట్టివారిగూడెం, కొత్తూరు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం గుమ్మడవల్లి గ్రామంలో భవనాన్ని, సిసి రోడ్లను ప్రాంభించారు. అనంతరం రమణక్కపేట గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆసుపాక గ్రామంలో సిసి రోడ్లతో పాటు నూతన బోర్‌వెల్‌ను ప్రారంభించి గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందించారు. అనంతరం మామిళ్లవారిగూడెం, పాకలగూడెం గ్రామాల్లో సిసి రోడ్లను ప్రారంభించి తొగ్గరగూడెం గ్రామంలో బోర్‌వెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, వార్డు సభ్యులు, గ్రామశాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం వర్తక సంఘంలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం నందు ప్రతి శనివారం అన్నదానం నిర్వహించారు. అన్నదాతలు స్వర్గీయ దంపతులు శ్రీమాన్ కాలం రాములు, భద్రమ్మ జ్ఞాపకార్థం స్వర్గీయ దంపతులు శ్రీమాన్ చెరుకుమల్లి అయ్యవార్ల లక్ష్మీ జ్ఞాపకార్థం వారి అల్లుడు, కుమార్తె శ్రీమాన్ కిలారు కృష్ణప్రసాద్, విజయ, స్వర్గీయ దంపతులు శ్రీమాన్ వెచ్చా బసవేశ్వరరావు, సులోచన జ్ఞాపకార్థం వారి సాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్నోహన్‌రావు, వెచ్చా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన



**ప్రజాపక్షం/చింతకాని:** మాదకద్రవ్యాల నివారణపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎస్ఐ నరేష్ కోరారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఆరోగ్యం, విద్య, కుటుంబం, సమాజంపై కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసీలు వేణుబాబు, గుంటి శ్రీనివాస్, సురేష్,కళాశాల అధ్యాపకులు జి మల్లయ్య, అయూబ్, కృష్ణార్జునరావు, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ముదిగొండ:** అనారోగ్యంతో బాధపడుతున్న పేదవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మందరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కొంత కాలం క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన నాగమణికి రూ.30వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కును అందజేశారు. ప్రజల సమస్యలను గుర్తించి వారికోసం పనిచేసే నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని, ప్రస్తుత రాజకీయాల్లో కుళ్ళు, కుతంత్రాలు పెరిగాయని తెలిపారు. ప్రజలకు నిజంగా సహాయం చేసే నాయకులు తగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు నరేష్, మాజీ ఉపసర్పంచి తాళ్ల శ్రీను, ఐఎన్‌టీయూసీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కట్టకూరి ఉమారావు, నాయకులు కొడకళ్ల రామకృష్ణ, తాళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష, సమావేశం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సెక్షన్ ఇన్‌చార్జీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ముఖ్యంగా డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఇంజనీరింగ్ విభాగానికి సూచించారు.పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి రాజీ పడకుండా సత్తుపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా, హరితవనంగా (క్లీన్ అండ్ గ్రీన్) తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పైప్‌లైన్ లీకేజీలు, ఇతర లోపాలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఏఈ సురేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్‌కు కౌన్సిలర్ పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 15వ వార్డు కౌన్సిలర్, దివంగత నేత తమ్మినేని కృష్ణయ్య సతీమణి తమ్మినేని మంగతాయిని 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు శనివారం ఆమె నివాసంలో పరామర్శించారు. గత కొంత కాలంగా స్వల్ప అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మంగతాయిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె ధైర్యంగా ఉండాలని, ప్రజల ఆశీస్సులతో త్వరలోనే మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

# గంధసిరి- పెద్దమండవ రహదారులపై ఇసుక మాఫియా బీభత్సం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని గంధసిరి పెద్దమండవ రహదారులపై అక్రమ ఇసుక రవాణా యధేశ్చగా సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు అతివేగంగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం కేవలం మూడు నిమిషాల వ్యవధిలోనే అరడజను ట్రాక్టర్లు వరుసగా ఇసుక లోడ్లతో దూసుకెళ్తున్నాయి. ఓవర్‌లోడ్‌తోపాటు టార్పాలిన్ కవర్లు లేకుండా ఇసుకను తరలించడం వల్ల రహదారిపై ఇసుక చెల్లాచెదురవుతూ వెనుక వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వారు చెబుతున్నారు. భారీ లోడ్లతో నిత్యం తిరుగుతున్న ట్రాక్టర్ల కారణంగా గ్రామీణ తారు రహదారులు దెబ్బతింటున్నాయని, విద్యార్థులు, వృద్ధులు రహదారి దాటేందుకు భయపడే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. పోలీసులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమ రవాణా పూర్తిగా ఆగడం లేదని ఆరోపిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, అతివేగం, ఓవర్‌లోడ్ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, మున్నేరువాగు పరిరక్షణతోపాటు ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## విబిఎస్ఏ బిల్లును సీతాకాలపు సమావేశాల్లో వ్యతిరేకించాలి

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పార్లమెంట్ సీతాకాలపు సమావేశాల్లో వికాస్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025ను మంత్రులు, ముఖ్యమంత్రులు వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ఏబిఎస్ఏ బిల్లు పూర్తిగా రాజ్యాంగ పరిమితులను ఉల్లంఘిస్తూ సమాఖ్య విధానాన్ని బలహీన పరుస్తుందని సంస్థాగత స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుందని ఉన్నత విద్యాప్రమాణాలు ప్రజాస్వామ్య సమగ్ర స్వభావానికి ముప్పు తెచ్చేదిగా ఉందన్నారు. విద్యార్థి సంఘాలు, మేధావులు ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులను ప్రజాస్వామ్య వాదులతో సంప్రదింపులు జరిపి అందులో ఉన్న లోపాలను తెలుసుకుని సరిచేయాలన్నారు. తద్వారానే ఉపయోగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి గుగులోత్ వంశీ, మాణిక్యాల వినయ్ జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ ఆసిఫ్, అఖిల్ ప్రశాంతి నవీన్ మహేశ్వరి రమణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టీం సంభవ ఫౌండేషన్ చేయూత



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సీతానగరానికి చెందిన 55 మంది విద్యార్థులకు బ్యాగులు, జ్యామెట్రీ బాక్సులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం అభినందనీయమని, వారి ఉన్నత చదువులకు ఫౌండేషన్ అందిస్తున్న సహకారం చిరస్మరణీయమని అన్నారు. అనంతరం పర్ణశాల సర్పంచ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత పేద విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్న టీం సంభవ ఫౌండేషన్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు పి సౌందర్యవేణి ఫౌండేషన్ వాలంటీర్ శ్రీలతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏజే ప్రభాకర్, పాఠశాల చైర్ పర్సన్ పూనెం జోగమ్మ, ఉపాధ్యాయులు కృష్ణార్జునరావు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నైనిష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలోని రామానుజవరం గ్రామం అయోధ్య నగర్ కాలనీ కి చెందిన కట్ట చిరంజీవి అనారోగ్యంతో భద్రాచలం సూర్య హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు వారి పరిస్థితి చానా దీనస్థితిలో ఉంది. ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో, దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటోంది. కట్ట చిరంజీవి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ఈ కుటుంబం దయనీయ పరిస్థితిని తెలుసుకున్న నైనిష ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి కట్ట చిరంజీవి కి రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నైనిష ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ సంస్థ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్ట్ పోదిల వీరబాబు, అడ్వకేట్ ఈర్ల రాము, జర్నలిస్ట్ మిట్టపల్లి గోపి, సాధిని సీతయ్య, బాణాల కృష్ణ, బానోతు రమేష్ కంపేర్ల నాగేశ్వరరావు, కట్ట మహేష్ పాల్గొన్నారు.

## ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామానికి చెందిన పోతు రాజుల సుస్మితకు రూ.5. లక్షల రూపాయల విలువైన ఎల్ఓసీ ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయాన్ని అందజేస్తోందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల నందు అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.స్రవంతి, డాక్టర్ శ్రీజన్, ఝాన్సీరాణి, హెల్త్ క్లినిక్ ఇంచార్జి శిరీష సంయుక్తంగా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డాక్టర్ ఎ.సరస్వతీ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినిల్లో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శానిటరీ ప్యాడ్లు ఎలా ఉపయోగించాలి, ఎప్పుడు మార్చాలి వాటిని వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు డాక్టర్ నాగాంజలి, నీలిమ, శ్రావిక, హిమశ్రీ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం పర్యటించారు. మండలం లోని కోరట్లగూడెం లో సీసీ రోడ్ల కు శంఖుస్థాపన చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కోనాయిగూడెం లో నందిగామ బ్రాంచి కెనాల్ పై హైలెవల్ వంతెన నిర్మాణం కు శంఖుస్థాపన చేశారు. సదాశివాపురం లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ను ప్రారంభించారు. మండలం లోని మోటాపురం, రాజేశ్వరపురం, అనాసాగారం, గువ్వలగూడెం తదితర గ్రామాలలో పలువురు కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ కి చెందిన ఆరెగూడెం పంచాయతీ సర్పంచ్ వడ్డె విశాల మంత్రి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. మంత్రి వారికి కండువా కప్పి సాదారంగా అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ను అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, తుంబూరు దయాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, మేకల వెంకటేశ్వర్లు, బొందయ్య, భద్రయ్య, పెంటమళ్ల పుల్లమ్మ, తిగుళ్ల భవాని, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, కుమ్మరి నాగమణి, కర్ల ఆశోక్, ఆనం వెంకటరెడ్డి, బోయిన కొండలు, వడ్లమూడి నర్సయ్య, కొత్తపల్లి నవీన్, కస్తాల నాగరాజు, గుంజులూరి మనోజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# భైరవునిపల్లి గంగమ్మ ఆలయంలో చోరీ

**హుండీ పగలగొట్టి రూ.50 వేలు ఎత్తుకెళ్లిన దొంగలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో ఘోరం జరిగింది. స్థానిక గంగమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ హుండీని ఎత్తుకెళ్లి, అందులోని నగదును దోచుకోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.వివరాల్లోకి వెళ్తే, శుక్రవారం రోజు ఆలయ అర్చకులు పూజలు ముగించుకుని గర్భగుడికి తాళాలు వేసి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన గుర్తుతెలియని దొంగలు, గర్భగుడి తలుపుల తాళాలను కట్టర్లతో కట్ చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఆలయంలో భక్తులు కానుకలు సమర్పించే హుండీని బయటకు మోసుకెళ్లారు. పొలం వెంబడి ఉన్న నిర్మానుష్య దారిలోకి హుండీని తీసుకెళ్లిన దుండగులు, అక్కడ దానిని పగలగొట్టారు. అందులో భక్తులు సమర్పించిన కానుకలు, నగదు కలిపి సుమారు రూ.50,000 వరకు అపహరించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. శనివారం తెల్లవారుజామున పొలం పనుల నిమిత్తం వెళ్తున్న ఓ రైతుకు దారిలో పగలగొట్టి ఉన్న హుండీ కనిపించింది. దీంతో దిగ్భ్రాంతికి గురైన సదరు రైతు వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఆలయం వద్దకు చేరుకుని చూసిన గ్రామస్థులు, తాళాలు కట్ చేసి ఉండటం గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రాంసింగ్ శనివారం ఉదయాన్నే దేవాలయం మరియు హుండీ పడేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ దొంగతనంపై ఆలయ కమిటీ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. ప్రశాంతంగా ఉండే భైరవునిపల్లిలో ఇలా దైవసన్నిధిలోనే చోరీ జరగడంతో భక్తులు, గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# సీతారామ ప్రాజెక్ట్ కెసిఆర్ కళ

**-క్రెడిట్ చోరీ చేసిన కాంగ్రెస్**
**-మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆరోపణ**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** సీతారామ ప్రాజెక్టుకి భూ సేకరణకు, అన్ని రకాల అనుమతులకు అనేక ఇబ్బందులను ఎదుర్కొని సీతారామ ప్రాజెక్టుకు కెసిఆర్ రూపకల్పన చేశారని సీతారామ ప్రాజెక్టు క్రెడిట్ కెసిఆర్ కి దక్కుతుందని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు వెంకట వీరయ్య అన్నారు. పెనుబల్లి మండలం గ్రామంలోని సప్తపది ఫంక్షన్ హాల్ నందు శనివారం మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులతో బిఎల్ ఎ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. మహిళను ఇబ్బందులు పెడుతున్న వారిపై ఫిర్యాదులు వస్తున్నా కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని బిఆర్ఎస్ వారిపై మాత్రం వెంటనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఎదురు దాడి సిద్ధాంతాన్ని ఎంచుకున్నారని అన్నారు. ఈ ప్రాజెక్టు కాలువలకు కి భూమిసేకరణకు గత ప్రభుత్వంలో రూ 19 వేల కోట్లు మంజూరు చేసిందని అన్నారు. పదివేల కోట్లు ఖర్చు పెట్టిందని ప్రాజెక్టు రూపకల్పనలో అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొని 90 శాతం పనులు పూర్తి చేసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తామే మొత్తం చేశామని క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గోదావరి నీరు ముందుగా విడుదల చేస్తుంటే పెనుబల్లి మండలంలో పంటలు బాగా పండేవని అన్నారు. రక్తం పారితే పంటలు పండే పనైతే బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మొత్తం రక్తం ఇస్తారని అన్నారు. రాబోవు ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని అన్ని సర్వేలు చెబుతున్నాయని ప్రతి ఒక్క ఓటు తప్పనిసరి అని సండ్రా వివరించారు. మండలంలో 6000 పైగా ఓట్లు నమోదు చేయవలసి ఉందని తప్పనిసరిగా ప్రతి ఒక్క ఓటుని నమోదు చేయించాలని సూచించారు. ఎస్ఐఆర్ నమోదులో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు కనకాల వెంకటరావు, కోటగిరి సుధాకర్ బాబు, చెక్కిలాల మోహన్రావు, సర్పంచ్ పాప, లక్కినేని వినీల్, పసుమర్తి వెంకటేశ్వరరావు, లగడపాటి శ్రీను, గోదా చెన్నారావు, బిఆర్ఎస్ సర్పంచులు, కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# శివలింగాపురం పీహెచ్‌సిలో వైద్యున్ని నియమించాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ డాక్టర్లు వెంటనే నియమించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాపనకుంట,శేషగిరి నగర్, అన్నారం, రాజపేట, విఠల్ రావు నగర్, కొత్త కొండాపురం, కమలాపురం, బెస్త గూడెం తదితర అనేక గ్రామాల ప్రజలు అనేక సంవత్సరాల నుంచి శివలింగాపురంలో పీహెచ్‌సి ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ2 డాక్టర్లు, నర్సులు అందుబాటులో ఉండడంతో, నిత్యం అనేకమంది ఈ ప్రాంత ప్రజలు, వృద్ధులు పిల్లలు, మహిళలు, గర్భిణీలు అనేకమంది పిహెచ్సి ని సందర్శించి, మందులు తీసుకుంటూ వైద్యం చేయించుకుంటున్నారు. గతంలో ఈ పిహెచ్సికి ఇద్దరు డాక్టర్లు ఉండేవారని నేడు ఉన్న ఒక డాక్టర్ కూడా ట్రాన్సఫర్ జరగడంతో గత నెల రోజుల నుండి శివలింగాపురం పిహెచ్సిలో డాక్టర్ లేకపోవడంతో రోగులు బాధితులు అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. డాక్టర్ లేకపోవడంతో కేవలం ఆయుర్వేద డాక్టర్ తో వైద్యం అందిస్తున్నారని, దీనివలన అనేకమంది ప్రజల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత జిల్లా అధికారులు డిఎంహెచ్ఓ, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి శివలింగాపురం పిహెచ్సికి డాక్టర్ ను వెంటనే నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, బోశెట్టి సంపత్ ఆదర రాములు, ఎస్వి నాయుడు, మంద కోటి, రాయల బిక్షం కొత్తపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# బంగారం కోసం వృద్ధురాలి దారుణ హత్య

**- మండలంలో వరుస దొంగతనాలు**
**-భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో చోటుచేసుకున్న వృద్ధ మహిళ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పిండిప్రోలు గ్రామానికి చెందిన చెన్న సుగుణమ్మ(60) అనే వృద్ధ మహిళను ఆగాంతకుడు ఆమె నుదుటిపై కత్తితో బలంగా నరికి హత్యచేసిన ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హత్య బంగారు ఆభరణాల కోసం జరిగిందా, లేక మరేదైనా వ్యక్తిగత కారాణాలు ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటన జరిగిన తీరు గ్రామస్తులను భయాందోళనకు గురి చేసింది. స్థానికుల కథనం ప్రకారం... పిండిప్రోలు సంత సమీపంలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కన ఉన్న వారి నివాస గృహంలో చెన్న జనార్ధన్ భార్య సుగుణమ్మ నివాసం ఉంటున్నారు. గుర్తు తెలియని ఆగాంతకుడు శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇంట్లోకి ప్రవేశించి వృద్ధ మహిళను అతి కిరాతకంగా చిత్రహింసలకు గురి చేసి హత్య చేశాడు. జనార్ధన్ పక్కనే ఉన్నప్పటికీ ఆయనకి పక్షపాతం ఉండటంతో ఆయన కదల్లేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో మెడలో బంగారు ఆభరణాలు కోసమే హత్య చేసి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఆమె మెడలో అప్పటికి నల్లపూసలు తాడు చెవి దుద్దులు పట్టీలు కాళ్లకు ఉండగా వాటిని వదిలేసి మెడలోని రెండు తులాల బంగారాన్ని తీసుకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. సుగుణమ్మ హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు క్లూస్ టీం డాగ్‌స్క్వాడ్‌తో ఊరును జల్లెడ పట్టారు. పోలీస్ జాగిలం మొదట సుగణమ్మ ఇంటి వద్ద నుండి వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరికి ఎస్సీకాలనీలో ఆగి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. గడిచిన రెండు సంవత్సరాల్లో వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చోరీలకు పాల్పడే వ్యక్తులు నిర్మానుష ప్రదేశాల్లో ఉన్న నివాస గృహాలను టార్గెట్ చేసుకుని మహిళల మెడలో ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా కొట్టి అవసరమైతే చంపి తీసుకువెళ్లే స్థాయికి దొంగలు దిగజారారు. అంతకు ముందు మూడు నెలల క్రితం గ్రామంలో మల్లెబోయిన యాదగిరి కిరాణాషాప్‌లో 12తులాల బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. అదే గ్రామంలో వృద్ధ మహిళ ఆరెంపల వెంకమ్మను కూడా ఇదే రీతిలో చిత్ర హింసలకు గురి చేసి బంగారం తీసుకెళ్లారు. ఇటీవల తిరుమలాయపాలెంలో మండలంలో వరుసగా దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస నేరాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అదే సమయంలో మండలంలో కొందరు యువకులు పేకాట, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, వాటిపై కూడా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పిండిప్రోలు హత్య కేసులో నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మండలంలో శాంతిభద్రతలు బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, పోలీస్‌శాఖను కోరుతున్నారు. సుగణమ్మ హత్యకు కారకులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై పిండిప్రోలు గ్రామ ప్రజలు ఆందోళన నిర్వహించారు. చెన్న జనార్ధన్ సుగణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సుగణమ్మ హత్య జరిగిన స్థలాన్ని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, కూసుమంచి సిఐ సంజీవ్, తిరుమలాయపాలెం ఎస్సై జగదీష్, రూరల్ సిఐ సంతోష్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వైద్య సాంకేతిక నిపుణులు సుగుణమ్మ బాడీని క్షుణ్ణంగా పరిశీలించారు. సుగణమ్మ చిన్న కుమారుడు చెన్న తిరుమలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభల దృశ్యమాలిక



## ప్రమాదపుటంచున ఆళ్లపల్లి, మర్కోడు రహదారి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండలంలోని ఆళ్లపల్లి, మర్కోడు ప్రధాన రహదారిపై రాఘవాపురం గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురికావడంతో వాహనదారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రహదారి దెబ్బతినడంతో ప్రమాదాల ముప్పు పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ మార్గంపై అవగాహన లేని కొత్త ప్రయాణికులు, రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రహదారి అంచు కుంగిపోవడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొన్నందున, సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జాతీయస్థాయిలో మెరిసిన పార్థవి



**ప్రజాపక్షం/కూసుమంచి:** గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి కూసుమంచి మండలం గురువాయిగూడెం తండాకు చెందిన పార్థవి బానోతు అరుదైన ఘనత సాధించింది. నీట్(యూజీ)2026లో 604 మార్కులు సాధించిన పార్థవి, నేషన్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 8855, ఎస్టీ విభాగంలో 61వ ర్యాంకు సాధించింది. పార్థవి తండ్రి కోటేశ్వరరావు(బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్, ఎస్‌డీఈ టీం), తల్లి కిరణ్మయి. ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ విధానంలో విద్యాభాస్యం పూర్తి చేసింది. ఎస్టీ విభాగంలో జాతీయ స్థాయిలో 61వ ర్యాంకు సాధించడంతో ప్రతిష్టాత్మక వైద్య విద్యాసంస్థలు ఎయిమ్స్, జిప్మర్ వంటి సంస్థల్లో ఎంబీబీఎస్ ప్రవేశానికి అవకాశాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించడంపై గురువాయిగూడెం తండా ప్రజలు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ పార్థవికి అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి సేవలందించాలని ఆకాంక్షించారు.

## మృతుల కుటుంబాలకు ఐఎఫ్‌టీయు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఐఎఫ్‌టీయూ అనుబంధ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీదేవి కోల్ ట్రాన్‌పోర్ట్‌లో పని చేస్తున్న స్టేషన్ బస్తీకి చెందిన మందా హేమంత్ తల్లి మందా జానకమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, పూసపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ బుడిమె రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబాలకు రూ 7,200 చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి మోహన్‌రావు, నాయకులు మోరే వెంకటేశ్వర్లు, పూనెం రాజేష్, ప్రశాంత్, మోకాళ్ల భద్రం, శ్రీధర్, అశోక్ పాల్గొన్నారు.

## కూసుమంచి కేజీబీవీలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ అజిత కుమారి తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 6వ తరగతిలో 5 సీట్లు, 7వ తరగతిలో 2 సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు, 9వ తరగతిలో 3 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం(సీఈసీ)లో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కేజీబీవీలో విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, పౌష్టికాహారం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు వివరించా రు. మహిళా సిబ్బంది పర్యవేక్షణలో భద్రతతో పాటు విద్యార్థినులలో నాయకత్వ లక్షణాల అభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగి న బాలికల తల్లిదండ్రులు అవసరమైన ధ్రువపత్రాలతో పాఠశాల పనిదినాల్లో కూసుమంచి కేజీబీవీని సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని స్పెషల్ ఆఫీసర్ అజిత కుమార్ కోరారు.

## అపోహలు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

**-10 మందిపై కేసు నమోదు, సంబంధిత అధికారిపై విచారణ**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మణుగూరు రేంజ్ పరిధిలోని మనుబోతులగూడెం గ్రామ పంచాయతీ నాగేశ్వరరావు గుంపు వద్ద ఇటీవల జరిగిన ఘటనపై అటవీ శాఖ అధికారులు శనివారం అశ్వాపురం రేంజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఫ్‌డిఓ బి బాబు మాట్లాడుతూ ఘటనకు సంబంధించి 10 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే సంబంధిత అధికారిపై కూడా విచారణ కొనసాగుతోందని వెల్లడించారు. అడవుల సంరక్షణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, అటవీ భూముల ఆక్రమణలు, అక్రమ కలప రవాణా, అడవుల విధ్వంసాన్ని అరికట్టేందుకు చట్టబద్ధమైన చర్యలే తీసుకుంటామని స్పష్టం చేశారు. అటవీశాఖ సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తారని, ఈ ఘటనపై ప్రచారంలో ఉన్న అపోహలు, తప్పుడు వార్తలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం, అటవీ పునరుద్ధరణ కార్యక్రమాల విజయానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, అడవులను పరిరక్షించడం ద్వారా భావితరాలకు పచ్చని తెలంగాణను అందించగలమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మణుగూరు రేంజర్ ఉపేందర్, అశ్వాపురం రేంజర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# మమతలో ఘనంగా స్తంభాద్రి ఐకాన్ సదస్సు

**-మానవ శరీరంలో కళ్లు అత్యంత కీలకం**
**-సదస్సులో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ, మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సర్వేంద్రియానాం నయనం ప్రధానం, మానవ శరీరంలో కళ్లు అత్యంత కీలకమైనవని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం మమత మెడికల్ కళాశాలలో స్తంభాద్రి ఐకాన్ 2026 పేరిట ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర 11వ ఆప్తాల్మాల్ లాజికల్ కాన్ఫరెన్స్ (కంటి వైద్య నిపుణుల సదస్సు)ను శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సదస్సును ప్రారంభించారు. మరో ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్న నానుడిని గుర్తు చేస్తూ మానవ శరీరంలో కండ్లు అత్యంత కీలకమైనవన్నారు. ప్రపంచంలో అన్ని దానాల కన్న నేత్ర దానం అత్యంత మిన్న అని, దేశంలో ఎన్నో కార్పొరేట్ ఆసుపత్రులు వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ ఎంతో మంది అంధత్వం, కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఇటువంటి



తరుణంలో కంటి వైద్య రంగంలో వస్తున్న ఆధునీక మార్పులపై చర్చించేందుకు ఖమ్మం నగరంలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల వల్ల వైద్య రంగంలో వస్తున్న మార్పుల గురించి తెలుసుకుని వాటిని ఉపయోగించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి కంటి సదస్సు నిర్వహించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కంటి వైద్య నిపుణులు, పరిశోధకులు ఆధునీక సాంకేతికతతో కంటి వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన సరికొత్త చికిత్సా విధానాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మమత మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నరేన్, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్ కృష్ణ, డాక్టర్ కెవి నందకిషోర్, డాక్టర్ ప్రవీణ్, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మారితేనే దేశం మారుతుంది..

**- మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** యువతలో విలువలతో కూడిన నాయకత్వం, బాధ్యతయుతమైన పౌరసత్వం పెంపొందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పదవీ మాజీ ఐఏఎస్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ప్రియదర్శిని మహిళా కళాశాలలో యువ నాయకత్వంమహిళా సాధికారత ద్వారా సమాజ పరివర్తన అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత కళాశాలకు విచ్చేసిన ఆయనను కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ...దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు కేవలం డిగ్రీలు సాధించడం మాత్రమే కాకుండా నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య స్ఫూర్తిని అలవరచుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, ప్రజాసేవ దృక్పథం యువతకు అత్యం అవసరమాన్నరు. మహిళలకు విద్య, ఆర్థిక స్వాలంబన, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని, వారిని ప్రోత్సహించడం కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం అందరి బాధ్యత అని అన్నారు. అవినీతి రహిత పాలన, పారదర్శకత, చట్టాల పట్ల గౌరవం, ప్రజాస్వామ్య విలువలను ప్రతి పౌరుడు తన జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించన ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థినులు నాయత్వం, పరిపాలన, ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్య, మహిళా సాధికారత, ప్రజస్వామ్యం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై అడిగిన ప్రశ్నలకు జయప్రకాశ్ నారాయణ తన అనుభవాలతో కూడిన సమగ్ర సమాధానాలు అందించి వారికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడాలి

**ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బెజవాడ రవిబాబు**




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** నేటి యువత చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడాలని మధిరలో యువజనోద్యమం ఏఐవైఎఫ్‌కి పూర్వ వైభవం కోసం కృషి చేస్తాం, అన్ని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బెజవాడ రవిబాబు పిలుపునిచ్చారు. ఆగస్ట్4వ తేదీన మధిర ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్‌లో జరిగే ఏఐవైఎఫ్ మధిర రూరల్ పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మదోజు శ్రావణ్‌లు పిలుపునిచ్చారు. స్థానిక మధిరలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐవైఎఫ్ మధిర రూరల్, పట్టణ ముఖ్య కార్యకర్తల సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు అయి వారి హక్కులను మరిచిపోతున్నారని, ఉద్యోగాల సాధనకై పోరాడాలని వారు అన్నారు. యువత చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడాలని మధిరలో యవజనోద్యమం ఏఐవైఎఫ్‌కి పూర్వ వైభవం కోసం కృషి చేస్తాం, అన్ని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బెజవాడ రవిబాబు పిలుపునిచ్చారు. ఆగస్ట్4వ తేదీన మధిర ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్‌లో జరిగే ఏఐవైఎప్ మధిర రూరల్, పట్టణ మహాసభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమాఏవవంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రహీం, ఏఐవైఎఫ్ మండల, పట్టణ నాయకులు సాయి, రాజేష్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని యజ్ఞ నారాయణపురం, వెన్నవల్లి తదితర గ్రామాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు తనిఖీ తో పాటు పలు సలహాలు సూచనలను చేశారు సిడిపిఓ నిర్మల జ్యోతి. అంగనవాడి కేంద్రంలో ఉన్న రికార్డులు ఆరోగ్యలక్ష్మి మెనూ పౌష్టికాహారం అందిస్తున్న మెనూ వివరాలు స్టాక్ రికార్డులు హాజరుశాతం తో పాటు పలురకాల రికార్డులను తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాలలో ఆవరణలో ఉన్న పారిశుద్ధ్య వివరాలు వివరాలు పరిసరాల పరిశుభ్రత విద్యార్థులకు బోధనా వివరాలను తోపాటు తల్లులు పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం పై సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీలు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాలకవర్గం, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి, గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని టీచర్లకు పలు సలహాలు, సూచనలను సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పర్యవేక్షకులు తోపాటు సర్పంచ్ లక్ష్మి , టీచర్లు, కరుణ, జ్యోతి, కమల ఝాన్సీ లతోపాటు అంగన్వాడి పిల్లలు, తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీను, మోహన్‌రావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఆటో డ్రైవర్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రావుల శ్రీనివాస్, పేరబోయిన మోహన్‌రావు లు ఎన్నికయ్యారు. మేకల భిక్షమయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా మహాసభలో 13 మంది ఆఫీస్ బేరర్స్‌ను 51 మందితో నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. యూనియన్ గౌరవాధ్యక్షులుగా పగడాల మల్లేష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన శ్రీనివాస్, మోహన్‌రావు లు మాట్లాడుతూ ఆటో కార్మికులను పూర్తిగా ప్రభుత్వం విస్మరించిందన్నారు. మోటార్ వర్కర్స్ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఇందిరమ్మ భరోసా క్రింద ఏడాదికి రూ. 15వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం బహుముఖ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

# వైరా ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుతం 16 అడుగుల మేర నీటి నిల్వలు ఉండి, గోదావరి జలాలు కూడా రిజర్వాయర్‌కు చేరుతున్నప్పటికీ ఆయకట్టు రైతులకు ఆసగునీటిని అందించకపోవడం సరికాదని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వైరాలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో వైరా రిజర్వాయర్‌లో కేవలం 9 అడుగుల నీటి నిల్వ ఉన్నప్పటికీ ఒక పంటకు సాగునీటిని విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం 16 అడుగుల నీరు నిల్వ ఉండి కూడా రైతులకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం, అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు చిలకా కోటయ్య, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు మాదినేని దుర్గాప్రసాద్, మిట్టపల్లి కిరణ్, కారుకొండ బోస్, కొల్లా రాంబాబు, వజినేపల్లి చక్రవర్తి, వేముల శివకుమార్, నూకల ప్రసాద్, పాసంగులపాటి శివ, సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను తనిఖీ చేసిన డిఇఓ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలోని అయ్యవారిగూడెం ప్రాథమిక పాఠశాలను శనివారం డిఇఓ జి.సదానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల నమోదుశాతం పెంచాలని, ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణిత పరిక్రియలు రావాలని ప్రధానోపాధ్యాయులు వెంకట శ్రీనివాసరావు సూచించారు. ఈకార్యక్రమంలో సిఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖాధికారి బి.మురళీమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నందు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలను ప్రధానార్చకులు ఉప్ప ల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ముత్యాల అలంకరణలో భక్తులకు స్వామి వారు దర్శన భాగ్యం కల్పించారు. శనివారం కావడడంతో ఆలయానికి వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు రావడంతో దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఈ సంవత్సరం జూ న్ మాసంలో దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయం నందు ఇంటర్వ్యూ, రాత పరీక్ష నిర్వహించటం జరిగిందని ఇఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. హైద్రాబాద్‌లోని రవీంద్ర భారతి లో జరిగిన కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా నియామక ప త్రాలను అభ్యర్థులు అరవెల్లి విజయాచార్యులు(హైద్రాబాద్), తనికెళ్లసాయి సతీష్ చంద్ర(హైద్రాబాద్), ఉప్పల సాయిశ్రీధర్,(జమలాపురం), పల్లూరి హిమగిరి వెంకటరంగసాయిశర్మ అందుకోగా వీరిలో ముగ్గురు అభ్యర్థులు ఇఓకు జాయినింగ్ రిపోర్ట్ సమర్పించి విధుల్లో చేరటం జరిగింది.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** వి.యం బంజర గ్రామంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల వైవిధ్యకరణ, వ్యవసాయ కుంటల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఏవిఎస్ ప్రసాద రాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం అస్థిరంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వరి సాగుకి బదులుగా పత్తి, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవిఎస్ ప్రసాద రాజు, నీటి పారుదల శాఖ ఏఈఈ నరేష్, పెనుబల్లి క్లస్టర్ ఏఈఓ నరేష్, గ్రామ సర్పంచ్ భుక్య ప్రసాద్ , గ్రామ ఉప సర్పంచ్ తాళ్లూరి రవి, గ్రామ పెద్దలు గోగినేని రమేష్, వంగ చంద్ర శేఖర్, పొన్నగంటి వాణి పతి గ్రామ రైతులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



**సాబీర్‌పాషా, గణేష్**

**ప్రజాపక్షం/పాల్వంచ :** పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని దీనికి ప్రతీ ఒక్కరం బాధ్యత తీసుకొని భావి తరాలకు భరోసా కల్పిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్‌లు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి శ్రీనివాసకాలనీలోని శ్రీనివాసగిరి దేవాలయంలో శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి, సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా హరితాహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో చోటు చేసుకొంటున్న మార్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరు చెట్లను నాటి సంరక్షించాలని కోరారు. చెట్లు వాతావరణ సమతుల్యాను పెంచుతాయన్నారు. ఆధ్యాత్మికతను పెంచే దేవాలయంలో వనమహోత్సవంలో భాగంగా చెట్లను నాటడం వలన ఒకవైపు ఆధ్యాత్మిక చింతన మరోవైపు ఆహ్లాదకరమైన వాతావరణం చోటు చేసుకొంటుందని తెలిపారు. భక్త సమాజ మండలి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి 5000 మొక్కలు నాటడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలకు మా సహాయ సహకారాలను ఎల్లప్పుడు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భక్తులచే మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిఓ క్రిష్ణ ప్రసాద్, డిఎస్‌పి సతీష్ కుమార్, తహశీల్దార్ దారా ప్రసాద్, కార్పోరేషన్ డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి,శ్రీనివాసగిరి ట్రస్టు చైర్మన్, సభ్యులు కొత్త వెంకటేశ్వర్లు, బిక్కసాని సుధాకర్ రావు, చెరుకూరి శివ పార్వతి, ఆలయ ప్రధానార్చకులు తోలేటి నగేష్‌శర్మ,అర్చకులు ఆరుట్ల ఫణిరాజా చార్యులు, ఊకె భద్రయ్య, తాటికొండ శ్రీలత, వంకదారు నరసింహకుమార్, చనుమోలు శ్రీనివాసరావు, బండి నారాయణ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల్లో శక్తి వంచన లేకుండా విధులు నిర్వహించాలి : ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పోలీసులు శక్తి వంచన లేకుండా విధులు నిర్వహించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. ఈ మేరకు శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన ఆయన పోలీస్ సిబ్బంది నుండి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని పుష్కరఘాట్ల వద్ద భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఘాట్ల వద్ద భక్తుల రద్దీనిదృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాలకు భక్తులు తరలివచ్చే మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలన్నారు. ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని, రిస్క్ ప్రాంతాలను ముందుగా గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి తెలిపారు. పుష్కరాల సమయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

# ఈసం రవి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/గుండాల:** తెలంగాణ గిరిజన గురుకుల పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, శ్రేయోభిలాషులు అందించిన విరాళాలతో సేకరించిన రూ 88వేలను దివంగత ఉపాధ్యాయుడు ఈసం రవి కుటుంబ సభ్యులకు పెద్ద కర్మ సందర్భంగా అందజేశారు. ఆపదలో ఉన్న సహోద్యోగి కుటుంబానికి రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల కుటుంబం అండగా నిలవడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జీఎల్‌పిటీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ రామారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కటుకూరి కృష్ణయ్య, జిల్లా బాధ్యులు జి రామనాథం, దేవన్ బాబు, బుచ్చయ్య, అశోక్, వెంకటేశ్వర్లు, కాంతారావు, రాములు, రాజశేఖర్, లోకనాథ్, రాజేందర్, లక్ష్మయ్య, ప్రవీణ్, రాము, నెహ్రూ, దమ్మపేట పాఠశాల ప్రిన్సిపాల్ పి వీరస్వామి, కిన్నెరసాని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు కావాలి



**-సీతంపేటలో ఎస్‌ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి**

**ప్రజాపక్షం/ఇల్లందు :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శనివారం ఇల్లందు నియోజకవర్గంలోని గార్ల మండలం సీతంపేట గ్రామంలో కొనసాగుతున్న ఎస్‌ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎంఎల్‌సి, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎల్‌ఏలు)తో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పి చైర్ పర్సన్ ఆంగోత్ బిందు, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బానోత్ హరిసింగ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు పంపిణీ



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ తరఫున నీలాద్రిపేట, గండి, అశ్వాపురంపాడు, గుత్తికోయ గ్రామాల్లోని గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులతో, చీరలు, సోలార్ విద్యుత్ లైట్లు, మహిళా అవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ శాఖ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు, రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సేవకులు భూసారపు రమేష్, పోలీస్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఏఐటీయూసీదే..



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి ప్రధాన కార్యాలయం, మెయిన్ వర్క్‌షాపులో శనివారం నిర్వహించిన తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ సాధన విజయోత్సవ సభలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని 2013లోనే ఏఐటీయూసీ తొలి ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అనంతరం 2017 మే నెలలో ''సింగరేణి జాతా'' పేరుతో తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ బస్సు యాత్ర నిర్వహించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీనేనని పేర్కొన్నారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ సాధనలో కార్మికులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు అందించిన సహకారం అభినందనీయమని ఆయన అన్నారు. అదేవిధంగా జేవీఆర్ ఓసీ 3, కోయగూడెం, శ్రావణపల్లి, మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్‌లను కూడా సింగరేణికే కేటాయించి సంస్థ మనుగడను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను చెల్లించాలని కోరారు. అలాగే, సింగరేణి సంస్థకు జెన్‌కో నుంచి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్), డైరెక్టర్ (పీపీ), జీఎం (సిపిపి), జీఎం (వెల్ఫేర్), సిఎంవోఏ నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి సర్పంచ్ వినతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం దుబ్బతండ గ్రామంలో అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ మత్రు నాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డీఈ, ఏఈలకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ(ఎం) టౌన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన నాయకులు అక్కడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని అన్నారు. ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదని, ప్రభుత్వం ప్రకటించిన నోటు పుస్తకాలు కూడా పంపిణీ కాలేదని తెలిపారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయ పోస్టుతోపాటు పలు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధనపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని, ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్, టౌన్ కార్యదర్శి వర్గ సభ్యుడు నందిపాటి రమేష్, నాయకులు నరసింహారావు, సతీష్, బాలకృష్ణ, రాములు, రఘు, వెంకటేశ్వర్లు, నసూర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సదస్సుకు వెళ్తున్న వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం



**ప్రజాపక్షం/కారేపల్లి:** యువ సంగ్రామ సదస్సుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ ఖండించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఆర్థిక సహాయం, రూ 500 గ్యాస్ తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. హామీలను వెంటనే అమలు చేసి, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆదివాసి మహిళకు అన్యాయం చేస్తే సహించం

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం క్రాస్‌రోడ్ పరిధిలో ప్రభుత్వ భూమిలో నివసిస్తున్న ఆదివాసి మహిళ పోడియం జానకమ్మను రెవెన్యూ అధికారులు వేధించడం సరికాదని ఏవీఎస్పీ నాయకుడు మల్లు దొర అన్నారు. 1976లో ప్రభుత్వం కేటాయించిన భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి జానకమ్మకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కుంజా నాగేశ్వరరావు, సున్నం వీరభద్రం, కనితి బుజ్జి, కనితి రామకృష్ణ, సీతారామయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రోడ్లకు మహర్దశ





**-రూ.94.50 కోట్లు మంజూరు**
**-మంత్రి తుమ్మల చొరవతో పరిపాలన అనుమతులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో రోడ్లకు మహర్దశ రానుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మం లోని ఆరు కీలక రహదారుల అభివృద్ధికి పరిపాలన అనుమతులతో పాటు రూ.94.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ రోడ్లు భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం నియోజక వర్గ ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఆర్థిక శాఖ అంగీకారంతో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారులను ఆర్అండ్‌బి శాఖకు బదిలీ చేయడంతో పాటు నిధులు కేటాయించింది. రోడ్ల అభివృద్ధికి సహకరించిన ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆరు రహదారులు ఖమ్మం జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక పట్టణ ప్రాంతాలను అనుసంధానించే అత్యంత కీలకమైన మార్గాలు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్ల వల్ల ప్రజలు, రైతులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ రహదారుల అభివృద్ధితో ప్రయాణ సౌకర్యం మెరుగుపడటమే కాకుండా రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌కు సులభంగా తరలించేందుకు వీలు కలుగుతుంది. పండితాపురం నుంచి పాపటపల్లి వరకు ఆరు కిలో మీటర్లకు రూ.16.50 కోట్లు, ఆర్అండ్‌బి రోడ్డు ఖమ్మం ఇల్లందు రోడ్డు నుంచి జింకలతండా వరకు రెండు కిలో మీటర్లకు రూ. 21 కోట్లు, ఖమ్మం నగరంలోని మధురానగర్ నుంచి కొత్తగూడెం రోడ్డు వరకు 2.6 కిలో మీటర్లు రూ. 15 కోట్లు, మంచుకొండ వివి పాలెం రోడ్డు (గడ్డికుంట తండా, మల్లేపల్లి, చింతగుర్తి) మీదుగా 8.4 కిలో మీటర్లకు రూ. 16 కోట్లు, పంగిడి నుంచి విక్రంనగర్ రోడ్డు (ఎన్‌వి బంజర, రజబ్‌అలీ నగర్) మీదుగా 9.7 కిలో మీటర్లకు రూ.18 కోట్లు, వేపకుంట్ల రోడ్డు (బల్లేపల్లి, బాలపేట, చెరువుకొమ్ముతండా) మీదుగా 5.3 కిలో మీటర్లకు రూ.8 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా రహదారులకు నిధులు మంజూరు చేసినందుకు ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# బంగారం పేరుతో రూ. 85.70 లక్షల వసూళ్లు



**-అంతర్రాష్ట్ర నేరగాళ్ల అరెస్టు**

**ప్రజాపక్షం/ఖమ్మం/కామేపల్లి :** తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని లక్షలాది రూపాయలు వసూలు చేయడంతో పాటు ఓ మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారంలోనూ ప్రమేయం ఉందని భావిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల ఆశను సొమ్ము చేసుకునే ప్రయత్నంలో లక్షలు పోగేసి జల్సాలు చేసి అప్పులు తీర్చుకుని చివరకు పోలీసులకు చిక్కారు. కారేపల్లి సిఐ ఎన్. సాగర్ తెలిపిన వివరాల ప్రకారం... కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన నారాయణ గురప్ప పలు పేర్లతో పలు రాష్ట్రాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, భూములను తక్కువ ధరకు ఇప్పిస్తానని, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని ప్రజలను మోసగిస్తూ తిరుగుతుండేవాడు. ఆయన వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో ఈ మోసాలకు పాల్పడ్డాడు. హరిప్రసాద్‌గా, భోగా లక్ష్మి నారాయణ గా తన పేర్లు ప్రచారం చేసుకుంటూ భక్తిడిగా ప్రజలను నమ్మిస్తుండేవాడు. గ్రామాల్లో పూజలు, పురస్కారాలకు దేవతా విగ్రహాల ఏర్పాటు, వివిధ జాతర్ల సందర్భంలో భక్తి సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తూ దాన ధర్మాలు చేసేవాడు. అలా ప్రజల్లో నమ్మకం కలిగిన తర్వాత తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తాని మోసాలకు పాల్పడటం ఆయనకు అలవాటుగా మారింది. మొదట కొద్ది మందికి బంగారం తక్కువ ధరకు ఇప్పించి పెద్ద మొత్తంలో వసూళ్లయిన తర్వాత పారిపోయే వాడు. కామేపల్లి మండలంతో పాటు ఖమ్మం పరిసర ప్రాంతాలకు చెందిన 18 మంది బాధితుల నుంచి సుమారు రూ. 85.70 లక్షలు వసూలు చేశాడు. ఇటీవల ఓ మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారంలోనూ వీరిపై కేసు నమోదైనట్లు సమాచారం. నారాయణ గురప్పతో పాటు కామేపల్లి మండలం బాసిత్ నగర్‌కు చెందిన బానోత్ సాయికుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మారుతీ ఎకో కారు, రెండు మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

# ఇందిరమ్మకు నోచుకోని మధిర

**-ఇండ్ల కోసం పేదల ఎదురుచూపు**







**ప్రజాపక్షం/ఖమ్మం/మధిర :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పక్కా ఇండ్లను మంజూరు చేస్తుంది. ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తుంది. నియోజక వర్గాల వారీగా ఇప్పటికే ఇండ్లు మంజూరు కావడం, నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు జరుగుతుండగా మధిరలో మాత్రం ఇండ్ల మంజూరు చేయలేదు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర పట్టణంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకపోవడం పట్ల పేదల్లో ఆవేదన వ్యక్తమవుతుంది. మున్సిపాలిటీలు, కార్పోరేషన్, పల్లెలు అన్న బేధం లేకుండా అర్హులైన పేదలకు ఇండ్ల మంజూరు జరుగుతున్న క్రమంలో మధిర మాత్రం ఎందుకు ఇండ్లను మంజూరు చేయడం లేదన్న ప్రశ్న తలెత్తుతుంది. మధిర పట్టణం గ్రామ పంచాయతీగానే ఉండేది. మల్లు భట్టివిక్రమార్క మధిర పట్టణం చుట్టూ ఉండే గ్రామాలను కలుపుతూ మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రజలకు వ్యవసాయం చిన్న చిన్న వ్యాపారాలే జీవనాధారం. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోవడం వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రీకరణ నేపథ్యంలో బతుకుదెరువు కోసం పెద్ద సంఖ్యలో గ్రామీణ పేదలు పట్టణాలకు వలస వచ్చారు. ఈ క్రమంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవాలన్న ఆశతో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. మధిర నియోజక వర్గాన్ని అభివృద్ధిలో శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్న మల్లు భట్టివిక్రమార్క ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పట్ల ఎందుకు తగు చర్యలు తీసుకోవడం లేదని పేదలు ప్రశ్నిస్తున్నారు. రెండు దఫాలుగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో మధిర పట్టణానికి అవకాశం ఇవ్వలేదు. ఇప్పటికైనా పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

## నేడు ఉమ్మడి జిల్లాలో భట్టి పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి కామేపల్లి మండల కేంద్రానికి చేరుకుని అక్కడ జరిగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మద్దులపల్లిలో 33/11 కెవి సబ్ స్టేషన్, బిటి రోడ్లకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి తాళ్లగూడెం చేరుకుంటారు. ఇల్లందు మండలం రోంపెడులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. రోంపెడు నుంచి ్ధంచి చేరుకుని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. తిరిగి ఖమ్మంజిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి గ్రామంలో అనంత సాగర్ నుంచి చింతకాని జెడ్పి రోడ్డు వరకు బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. తిమ్మినేని పాలెం, ముదిగొండ మండలం చిన్నమండవ గ్రామాల్లో భట్టి విక్రమార్క పర్యటిస్తారు. సోమవారం కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద జరిగే పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొననున్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

**-బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమని బిఎల్‌వోలు అప్రమత్తంగా ఉంటూ అర్హుల పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ గడువు పొడిగించినందున పార్టీకి సంబంధించిన బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉంటూ అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపేందుకు ఓటర్లకు సహకరించాలని కోరారు. బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దినేని వెంకటరమణ, పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులు అజ్మీర వీరునాయక్, గుత్తా రవి, మెంటెం రామారావు,కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వర రావు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు మాధంశెట్టి హరిప్రసాద్, దారా శ్యామ్, యాసా రామారావు, తాతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యువతను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

**-కాంగ్రెస్ కార్యాలయంలో నిరసన దీక్ష**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యువతను విస్మరించి కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. యువత పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా లోక్‌సభ పక్షనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎంఎల్‌సి, ఎంఎల్‌ఏ పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు లు సంఘీభావం తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ మొదటి సారి కాదని ఇంతకు ముందు కూడా జరిగిందని ఈ లీకేజీ కారణంగా ఎంతో మంది విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు సందర్భాలలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ సభ్యులు గజ్జెల్లి వెంకన్న, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వెజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ హుస్సేన్, విప్లవ్‌కుమార్, కిలారు అనిల్‌కుమార్, స్వరూప, ప్రభావతిరెడ్డి, గాదె ఝాన్సీ, నాయకులు పాల్గొన్నారు.

## పానశాలలుగా మారిన ప్రాంగణాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న ప్రయాణికుల ప్రాంగణాలు మద్యం ప్రియులు పానశాలలుగా మార్చుకున్నారు. మండల పరిధిలోని తెలగవరం క్రాస్ రోడ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ధర్మదాతలు మరణించిన వారి జ్ఞాపకార్థంగా కొన్ని సంవత్సరాలు క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ను నిర్మించారు. దానిని ఇప్పుడు ప్రస్తుతానికి మద్యం ప్రియులు పానశాలలుగా మార్చుకొని రాత్రి 7 గంటల నుండి 10 గంటల లోపు ఇక్కడే మాటామంతి ఇష్ట గోస్టి తో అక్కడనే కూర్చొని బహిరంగ మద్యాన్ని సేవిస్తున్నారు. ప్రయాణికులకు అనుకూలంగా ఈ ప్రాంగణాన్ని ఉంచాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను అట్టి స్థలం ప్రయాణికులకు అనుకూలంగా ఉంచాలని, ఆర్ అండ్ బి, రెవెన్యూ పంచాయతీ, అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.